క్లుప్తంగా

మాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్‌రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో ఆదివారం మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దాతలు వంగవీటి లోకేష్, వంగవీటి నాగరాజు ఏర్పాటు చేసి ప్రారంభించారు. అన్నదానంలో సుమారు 450మంది మాలధారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, బర్మావత్ సీతరాంసింగ్, రంగా, నాగరాజు, మాలధారులు ఉన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 28న ఎంపీపీ పార్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మామిడి జానకిరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

28న శ్రీరామ అక్షింతల శోభాయాత్ర



సమావేశంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

హుజూర్‌నగర్ : శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు పంపిన శ్రీరామపూజిత అక్షింతల శోభాయాత్ర ఈనెల 28న పట్టణంలో నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యులు ఆదివారం వెల్లడించారు. ఈ సందర్భంగా పట్టణ పుర ప్రముఖులు, పెద్దలు, అన్ని దేవాలయాల కమిటీల వారు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. అయోధ్యలో నిర్మితమైన శ్రీరామ మందిరంలో ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని శ్రీరామపూజిత అక్షింతలు పట్టణానికి వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో పుర ప్రముఖులు, పెద్దలు, ఆలయాల కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారుల ఇరుముడి మహోత్సవం



ఇరుముడి మహోత్సవంలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

మఠంపల్లి : మండలంలోని రామచంద్రాపురం తండాలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం స్థానిక అంజనేయ స్వామి మాలధారణ భక్తుల ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారికి ప్రత్యేకార్చనలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ బుజ్జిభీముడు దంపతులు హాజరై మాలధారణ భక్తులకు రూ.10వేలు అందజేశారు. అనంతరం మాలధారులు ఇరుముడులతో మద్దిమడుగు శ్రీఆంజనేయస్వామి ఆలయానికి యాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

సోలార్ లైట్ల అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం గ్రామానికి ఎల్‌ఐసీ క్లబ్ మెంబర్లు కొప్పోజు సూర్యనారాయణ, పొదిల ఏడుకొండలు, హనుమంతరావు రూ.75వేల విలువ గల సోలార్ లైట్లను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగసైదయ్య, ఎంపీటీసీ రాజారావు, గ్రామస్తులు ఉన్నారు.

లింగారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



లింగారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు, తదితరులు

మునగాల : మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఎల్–33ఎత్తిపోతల పథకం వైస్‌చైర్మన్ వీరంరెడ్డి లింగారెడ్డి(70)మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి అన్నారు. శనివారం లింగారెడ్డి మృతి చెందడంతో ఆదివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట గ్రామసర్పంచ్ గోపిరెడ్డి వెంకటరెడ్డి, మండల నాయకులు దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, శాఖ కార్యదర్శి గోపిరెడ్డి, మల్లారెడ్డి, సోమిరెడ్డి జమున, అన్నెం బుచ్చిరెడ్డి, మూల వెంకటరెడ్డి ఉన్నారు.

అంతుచిక్కని వ్యాధితో అవస్థలు

- ఇంటికి ఒకరు లేదా ఇద్దరు జర్వం, కీళ్ల నొప్పులతో ఇబ్బందులు
- నారాయణపురం ఎస్సీకాలనీలో 400మందికిపైగా బాధితులు
- వ్యాధి అర్థం కాక తలలు పట్టుకుంటున్న ప్రజలు
- పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని కాలనీవాసుల వేడుకోలు



చిలుకూరు : నారాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయం

చిలుకూరు : అంతుచిక్కని వ్యాధి ఆ గ్రామాన్ని భయపెడుతుంది. కీళ్ల నొప్పులు, జ్వరాలతో బాధితులు విలవిలలాడుతున్నారు. పసిపిల్లల దగ్గర నుంచి 80ఏళ్ల వృద్ధుల వరకు ఈ వ్యాధితో నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఘటన మండలంలోని నారాయణపురం గ్రామంలో గల ఎస్సీకాలనీలోని నెలకొన్న పరిస్థితి. గ్రామంలోని ఎస్సీకాలనీలో మొత్తం 300వరకు ఇళ్లు ఉంటాయి. సుమారుగా 750వరకు జనాభా నివసిస్తున్నారు. ఈ కాలనీవాసులు గత కొద్ది రోజులుగా విష, టైఫాయిడ్ జ్వరాలు, కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. ఇంటికి ఒకరు లేదా ఇద్దరు చొప్పున ఈ సమస్యతో సతమతమవుతున్నారు. దీంతో స్పందించిన వైద్యులు కాలనీలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అయినా జ్వరాలు తగ్గకపోవడంతో కొంత మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చిక్సిత పొందడంతో కొంత మేరకు జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. మరికొంత మందికి డబుల్ టైఫాయిట్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో దాదాపు 400మంది వరకు బాధితులు ఉన్నారు.

నొప్పులతో నడవలేని పరిస్థితి..

కాగా జ్వరాలు కొంత మేర ఉండగా పలువురు కీళ్ల, కాళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడవలేని స్థితిలో ఉన్నారు. ఎక్కడా చూపించినా, ఎన్ని మందులు వాడినా కొద్దిసేపు మాత్రమే తగ్గి మళ్లీ యాథావిధిగా నొప్పులు వస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. 30ఏళ్ల నుంచి 80ఏళ్ల వయస్సు వరకు గల పలువురు బాధితులు ఇతరుల సహాయం లేకుండా నడవలేని స్థితిలో ఉన్నారు. రక్త పరీక్షలు చేసినా రిపోర్ట్స్‌లో ఏమి లేవని వస్తున్నాయని, కాని నొప్పులు మాత్రం తగ్గడం లేదని బాధితులు అంటున్నారు. దీంతో తాము కూలీ పనులకు వెళ్లలేక ఇళ్లు గడవలేని పరిస్థితి ఉందని, అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి కాలనీలో ప్రత్యేకంగా వైద్యులతో వైద్యపరీక్షలు నిర్వహించి తమను నొప్పుల బారినుంచి విముక్తి కలిగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నొప్పులతో ఇబ్బందులు పడుతున్నాం



కొన్ని రోజులుగా జ్వరంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. జ్వరం కొద్దిగా తగ్గినా నొప్పులు మాత్రం చాలా తీవ్రంగా ఉన్నాయి. కర్ర సహాయం లేకుండా నడవలేని పరిస్థితి ఉంది. ఇప్పటికే పలుమార్లు ప్రైవేట్‌గా వైద్యపరీక్షలు చేయించుకున్నాను. రూ.10వేల వరకు ఖర్చు వచ్చింది. అయినా నొప్పులు మాత్రం ఏ మాత్రం తగ్గలేదు. రక్త పరీక్షలు చేయించినా రిపోర్టులలో ఏమి లేదని వచ్చింది. కాలనీలో ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించాచి మా ఇబ్బందులు తొలగించాలి.

– కొండా అంజమ్మ, నారాయణపురం

ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం

నారాయణపురం కాలనీలో 400మంది వరకు బాధితులు జ్వరాలు, నొప్పులతో బాధపడుతున్న మాట వాస్తవమే. కాలనీలో ఇప్పటికీ ఇంటింటికీ వైద్యపరీక్షలు చేస్తున్నాం. రక్త పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేస్తున్నాం. వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– నవ్య, మండల పీహెచ్‌సీ వైద్యాధికారిణి

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మునగాల : వికసిత్ భారత్ క్యాలెండర్ల ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, బ్యాంకు సిబ్బంది తదితరులు

మునగాల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ నాతాల మధుసూదన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని నర్సింహాపురంలో ఆదివారం క్యాలెండర్లు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ, పోస్టల్ శాఖ, గ్యాస్ ఏజెన్సీలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ మాట్లాడారు. 2013నుంచి దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కారింగులు నాగమణి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సామాజిక ఉద్యమకారులు వేమూరి సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, గ్రామశాఖ అధ్యక్షుడు కోధుమూరి రామకృష్ణ, పలువురు గ్రామపెద్దలతో పాటు ఆయా గ్రామాలకు చెందిన కోర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

క్యాలెండర్ల ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : భారతప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ క్యాలెండర్లను ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రామరాజు, నాయకులు కె.పాపిరెడ్డి, కె.నాగేంద్రచారి, పి.నగేష్, ఎస్.నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీ కందఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సేవాకాలం, మంగళశాసనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీగోదాదేవి అమ్మవారికి పల్లకిసేవ, తీర్థ ప్రసాద గోష్ఠి, ఆరగింపు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్షేత్ర పాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం ఆలయ క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయస్వామికి వేయి తమలపాకులతో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయంలో విష్ణుసహస్రం, గోదా, రామానుజ అష్టోత్తర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, అధికారులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : పూజల్లో పాల్గొన్న భక్తులు

క్రిస్మస్ వేడుకలకు శుభవార్త చర్చి ముస్తాబు



మఠంపల్లి శుభవార్త చర్చిలో బాలయేసు జన్మించినట్లుగా ఏర్పాటు చేసిన పశువుల పాక

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చి నేడు (సోమవారం) జరిగే క్రిస్మస్ వేడుకలకు విద్యుత్ వెలుగులతో అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం అర్ధరాత్రి క్రీస్తు జననంతో ఉత్సవాలు ప్రారంభమై సోమవారం సాయంత్రం బాలయేసు మరియామాత ప్రతిమలతో తేరుపై పురవీధులతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం చర్చిలో దివ్యబలిపూజ, మధ్యాహ్నం కొవ్వొత్తుల సమర్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే విధంగా మండల కేంద్రంలో క్రైస్తవులు తమ ఇళ్లపై స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలను విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించారు.

క్రిస్మస్ వేడుకలకు 123ఏళ్ల చర్చి ముస్తాబు

నడిగూడెం : మండల కేంద్రంలో 123ఏళ్ల క్రితం నిర్మించిన సీఎస్ఐ చర్చి నేడు (సోమవారం)నిర్వహించే క్రిస్మస్ వేడుకలను ముస్తాబైంది. ఈ చర్చి కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ ప్రాంతాల్లో తొలి చర్చి కావడం విశేషం. అలాగే మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కోదాడఅర్బన్ : క్రిస్మస్ వేడుకలకు పట్టణంలోని క్రీస్తు ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగు విద్యుత్ దీపాలతో దేదీప్యామానంగా వెలుగుతున్నాయి. పట్టణంలోని నయానగర్‌లో గల బాప్టిస్ట్ చర్చిను పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి జరిగే క్రిస్మస్ జనన వేడుకల అనంతరం ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా పట్టణంలోని సీసీరెడ్డి కాన్వెంట్ వద్ద ఉన్న చర్చితో పాటు, అంబేద్కర్ కాలనీ, ఆజాద్‌నగర్, హరిజనవాడలతో పాటు పట్టణంలో ఉన్న 30కి పైగా చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

చిలుకూరు : మండల కేంద్రంలోని జేజేనగర్ కాలనీలోని బీసీఎం కలువరి వెలుగు చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికాంత్, అబ్రహం, లక్ష్మణ్, కాలనీవాసులు ముదిగొండ వెంకటేశ్వర్లు, జాన్‌బాబు, హరికృష్ణ, వీరబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి చర్చి ఆవరణలో వెలిసిన దుకాణాల సముదాయం



కోదాడఅర్బన్ : క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన కోదాడ నయానగర్‌లో ఉన్న బాప్టిస్ట్ చర్చి



నడిగూడెంలోని 123 ఏళ్ల నాటి సీఎస్ఐ చర్చి



చిలుకూరు చర్చిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఆర్ఎంపీలు, పీఎంపీలు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

మునగాల : గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఆర్ఎంపీలు, పీఎంపీలు ఐక్యమత్యంగా ఉండి పనిచేయాలని రూరల్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దొంతగాని రవి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో రూరల్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు ఎరుకల శ్రీశైలం గౌడ్ అధ్యక్షన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనియన్ భవనం కోసం ఖాళీస్థలం సేకరణ, భవన నిర్మాణం కోసం మండలంలోని అందరు సభ్యులు విధిగా సభ్యత్వ రుసుము చెల్లించాలని కోరారు. అదే విధంగా తమవంతు విరాళం కూడా ఇవ్వవచ్చన్నారు. సమావేశంలో సూర్యాపేటకు చెందిన ప్రముఖ వైద్యులు బెల్లంకొండ రామ్మూర్తి, ఖమ్మం పట్టణానికి చెందిన కేశగాని రాజశేఖర్‌గౌడ్‌లను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నడిగూడెం మండల శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, కోదాడ మండల అధ్యక్షుడు భూతం శ్రీనివాస్, మండలానికి చెందిన సభ్యులు అబ్దుల్ రహీం, ఉపేంద్రచారి, అనిల్‌కుమార్, పురుషోత్తం (బాబు), ఆదినారాయణ, ఖాదర్, రజినీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



ఆదర్శ రైతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆదర్శ రైతులు సుంకర శ్రీరాంమ్మూర్తి, నామా సత్యనారాయణప్రసాద్, సిరికొండ బుచ్చయ్య, బాణోతు రాజేశ్వరీ, కట్టా చంద్రారెడ్డి, కొణతం సైదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కోటయ్యలను శాలువాలతో సత్కరించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. దేశానికి వెన్నెముకగా నిలిచే రైతులను లయన్స్ క్లబ్ ద్వారా సన్మానించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవల్లి సత్యనారాయణరెడ్డి, సభ్యులు సుంకర క్రాంతికుమార్, జిలకర రామస్వామి, గుండా సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, యూసఫ్, రైతులు వెంకటేశ్వర్లు, కల్పన, మోహన్‌చంద్ర తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

చిలుకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991లో పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు కలుసుకుని తమ యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ



కోదాడఅర్బన్ : కోదాడ బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేసిన సొసైటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం, మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మునగాల, నడిగూడెం, మోతె మండలాలకు చెందిన పలువురు క్రైస్తవులకు ఆదివారం విందు, దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పాల్గొని మండలానికి చెందిన 125మంది పేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఎంపీటీసీలు ఉప్పుల రజిత, కాసర్ల కల్పన, మునగాల తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ రాధారెడ్డి, సర్పంచ్ చింతకాయల ఉపేందర్, మాజీ సర్పంచ్ కాసర్ల కోటేశ్వరరావు, నాయకులు కాసర్ల శ్రీనివాస్, నడిగూడెం, మోతె మండల తహసీల్దార్లు, బిషప్ డా.జె.సుదర్శనం, జెజె.సామ్యూల్‌సన్, ఎల్.లాజర్, కె.ఏసురత్నం, క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : పట్టణంలోని నయానగర్‌లో గల బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం పెయిత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పేద క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు, పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బానోతు జగ్గునాయక్, చర్చి పాస్టర్ యేసయ్య, పాస్టర్ ప్రభుదాస్, మోజస్, అజాయానంద్, రామకృష్ణ, రాంబాబు, స్టీఫెన్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



మునగాల : దుస్తుల పంపిణీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవులు

ఫొటోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

మోతె : మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వేముల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కాంపాటి మురళీ, కోశాధికారిగా నవిలే లింగయ్య, ఉపాధ్యక్షుడిగా అర్వపల్లి శేఖర్, సహాయ కార్యదర్శిగా దండుగల మధు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శీలం హన్మంతరావు, ఎస్‌కె జానిమియా, కాంపాటి జానయ్య, వనం నర్సింహరావు, కంటి వీరస్వామి, నాయిని శ్రీకాంత్, కొత్తూర్ అశోక్, కర్నల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి పరామర్శ

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కమధన పెద్దరామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, ఎంపీటీసీ మండవ శైలజ చిన్నా, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య ఉన్నారు.



రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తదితరులు

మండల కమిటీ ఎన్నిక

మోతె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బొమ్మగాని వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా కలగాని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా నవిల నాగరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల రవిచంద్ర, జలగం తిర్పయ్య, తుమ్మకొమ్మ అక్కులు, వీరయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన పంచాయతీ కార్మికుల కార్యవర్గం